ప్రజాశక్తి

శనివారం 11 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మున్సిపల్ కార్మికుల ఆందోళనలు

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్

మున్సిపల్ వర్కర్ల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ వర్కర్లు ఏడాది క్రితం నిర్వహించిన 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలంటూ జివిఎంసి పరిధిలోని విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లో కార్మికులు శుక్రవారం ఆందోళనలకు దిగారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద .జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దీక్షలో కూర్చున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023- 24 సంవత్సరాల మధ్య రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 17 రోజుల సమ్మె చేసిన క్రమంలో ప్రభుత్వం తమ యూనియన్‌తో ఒప్పందం చేసుకుందన్నారు. ఆ ప్రకారం అమలు చేయవలసిన డిమాండ్లను నేటి వరకు అమలు చేయలేదన్నారు. ముఖ్యంగా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, 10 సంవత్సరాల మిగతా 2లో..

అనకాపల్లిలో ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

బాలికపై లైంగిక దాడి కేసులో..

యూట్యూబర్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు శుక్రవారం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. టిక్‌టాక్, యూట్యూబ్ ద్వారా ప్రాచుర్యం పొందిన ఫన్ బకెట్ భార్గవ్ 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో అతనికి 20 సంవత్సరాల జైలు శిక్షకు విధించింది. కేసు వివరాల్లోకి వెళ్తే.. నిందితుడు బాధిత బాలికతో టిక్‌టాక్ వీడియోలు చేస్తూ, ఆమెను బెదిరించి, పదేపదే లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ అమానుష చర్యల కారణంగా బాలిక గర్భం దాల్చింది.

భార్గవ్ (ఫైల్ ఫొటో)

పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో 2021లో నమోదు చేసిన కేసు ఆధారంగా విశాఖ నగర మహిళా పోలీస్ స్టేషన్ ఎసిపి డాక్టర్ జి.ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో ఈ కేసులో పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించారు. ఛార్జ్‌షీట్‌ను సమర్థంగా కోర్టులో సమర్పించి, సాక్ష్యాలను అందించారు. సదరు సాక్ష్యాల ఆధారంగా విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు బాధిత బాలికకు నష్ట పరిహారంగా రూ.4 లక్షలు చెల్లించాలంటూ ఆదేశించింది.

కోడి పందేల శిబిరంపై దాడి

మాజీ ఎమ్మెల్యే చింతలపూడితో సహా 29 మంది అరెస్ట్

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని గండిగుండం -రామవరం రోడ్డులో శుక్రవారం కోడి పందేల శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య సహా 29 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఎసిపి ఎస్.అప్పలరాజు మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. పక్కాగా అందిన సమాచారం మేరకు పేకాట, కోడి పందేల శిబిరంపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడి చేశారు. 29 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.07 లక్షల నగదు, మిగతా 2లో..

తారురోడ్లపై భోగి మంటలు వద్దు

వార్త 4లో..

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

వార్త మెయిన్‌లో..

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

వార్త 4లో..

అంబేద్కర్, గాంధీ విగ్రహాల వద్ద నివాళ్లర్పిస్తున్న షర్మిల

అమిత్ షా రాజీనామా చేయాలి

పిసిసి అధ్యక్షులు షర్మిల

వార్త మెయిన్‌లో..

'ఉక్కు'పై కూటమి పాలకులు స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై కూటమి పాలకులు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1429వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో స్టీల్ ఎల్‌ఎంఎం, డబ్ల్యుఆర్‌ఎం -1, ఎంఎంఎస్‌ఎం, డబ్ల్యుఆర్‌ఎం - 2, ఎస్‌బిఎం, ఎస్‌టిఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉక్కు కర్మాగారాన్ని కాపాడతామని వాగ్దానం చేసిన కూటమి నేతలు నేడు నోరు మెదకపోవడం దారుణమన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం వామపక్ష పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలిచి కేంద్ర బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. దీక్షల్లో నాయకులు ఎన్.రామారావు, వైటి.దాస్, డి.దేముడు, జి.ఆనంద్ పాల్గొన్నారు.

తొక్కిసలాటపై సిట్టింగ్ జడ్జితో విచారణ

శాసన మండలి విపక్ష నేత బొత్స డిమాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తిరుపతి తొక్కిసలాట ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం బీచ్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటనను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వరుస ఘటనలతో తిరుమల ప్రతిష్టపై భక్తుల్లో నమ్మకం సన్నగిల్లుతోందని, దాన్ని కాపాడాలని న్యాయమూర్తిని కోరారు. టిటిడి ఛైర్మన్, ఇఒల మధ్య సమన్వయ లోపంతోనే ఘటన జరిగిందని పత్రికలు, డిప్యూటీ సిఎం చెబుతున్నా వారిపై చర్యలు తీసుకోవడంలో సిఎం చంద్రబాబు ఎందుకంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పినంత మాత్రాన పోయిన భక్తుల ప్రాణాలు తిరిగి రావని, ఆయన ప్రాయశ్చిత్త దీక్ష ఎప్పుడు చేస్తారో చెప్పాలని అన్నారు. ఘటన అనంతరం ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసినంత మాత్రాన బాధితులకు న్యాయం జరిగినట్టు కాదన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బొత్స

మొదటి పేజీ తరువాయి..

మున్సిపల్ కార్మికుల ఆందోళనలు

సర్వీస్ వారికి ఇచ్చే రూ.లక్ష, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియో చెల్లింపు, దహన సంస్కారాలకు ఇచ్చే మట్టి ఖర్చుల మొత్తం రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంపుదల, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్, జీతాలపెంపు, సంక్షేమ పథకాల అమలు, తదితర ఒప్పంద హామీలను అమలు చేస్తూ వెంటనే జిఒలు జారీ చెయ్యాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచిందని, గత ఒప్పంద విషయాలపై జిఒల జారీకి సిఎంను, మున్సిపల్ శాఖ మంత్రిని, ఉన్నతాధికారులను పలు పర్యాయాలు కలిసి విన్నవించినా స్పందన లేదని అన్నారు. దీక్షల అనంతరం జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. తక్షణం జిఒలను విడుదల చేయకుంటే సంక్రాంతి అనంతరం సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముద్దాడ వరప్రసాద్, గొలగాని అప్పారావు, జెఆర్.నాయుడు, వెంకటరావు, గణేష్, రాజు, సత్యవతి, ఒమ్మి అప్పారావు, రమణ, శేషు బాబు, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

అనకాపల్లి : గత సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు వెంటనే జారీ చేయాలని కోరుతూ జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు అధ్వర్యంలో శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం జోనల్ కమిషనర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు 4 సంవత్సరాల నుండి రావాల్సిన సరెండర్, ప్రమోషన్ స్కేల్, ఇంక్రిమెంట్లు, కార్మికులకు హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి ఏసురాజు, గోవిందు, ఓంశివ, రెల్లి సత్య నారాయణ, యర్రంశెట్టి శివకుమార్, అజయ్, నూకరాజు, ప్రసాద్, భారతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

8 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో మొదటి నిందితునిగా వల్లభనేని వంశీకృష్ణ ఉండగా, మిగిలిన నిందితుల జాబితాలో మాజీ ఎమ్మెల్యే వెంకటరామయ్య పేరును 28 నెంబరులో చేర్చారు. స్థానిక సిఐ చింతా వాసునాయుడు, ఎస్ఐ గంట్యాడ సంతోష్ దాడుల్లో పాల్గొన్నారు. కోడి పందేలలో పట్టుబడ్డ వారిలో పలువురు ముఖ్య నేతలతోపాటు మాజీ ఎమ్మెల్యే కూడా ఉండడంతో శుక్రవారం ఆనందపురం పోలీస్ స్టేషన్ రాజకీయ నాయకులతో నిండిపోయింది.

సమావేశంలో మాట్లాడుతున్న సోమన్నారాయణ

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని, జనవరి 1 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించినందున, ప్రత్యామ్నాయ వస్తువులను అందరూ వినియోగించాలని, ఆ దిశగా సామాజిక మాధ్యమ ప్రభావితులు సామాజిక బాధ్యతతో సోషల్ మీడియా ద్వారా ప్రజలకు, వ్యాపారులకు విస్తృత అవగాహన కల్పించాలని జివిఎంసి అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ కోరారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో తన చాంబర్‌లో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్‌తో కలిసి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి దుకాణదారునికి ప్లాస్టిక్‌కు బదులు ప్రత్యామ్నాయ వస్తువులు అమ్మే వ్యాపారుల ఫోన్ నెంబర్లు ఇప్పటికే అందించామని తెలిపారు. ఉదాహరణకు ప్రస్తుతం వినియోగిస్తున్న టీ కప్పులు కూడా కాగితం కప్పులవలె కనిపిస్తున్నప్పటికీ అందులో కూడా ప్లాస్టిక్ పొర ఉంటుందని ప్రాక్టికల్‌గా అదనపు కమిషనర్ వారికి ప్రదర్శించారు. అందువల్ల ఒకసారికి వినియోగించి పారవేసే ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయమైన స్టీలు, గాజు, పింగాణీ, పేపర్, వస్త్ర, నార వస్తువులను వినియోగించేలా సోషల్ మీడియాలో ప్రచారం కల్పించాలని కోరారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 19 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి ఈ శుక్రవారం 19 వినతులు వచ్చాయని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించేందుకుగానూ ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మురికివాడలో మౌలిక సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం 42వ వార్డు పరిధిలో ఉన్న ఇందిరా గాంధీ కాలనీ మురికివాడను శుక్రవారం జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతితో కలిసి పరిశీలించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడ నివసిస్తున్న వారి నుంచి స్వయంగా తెలుసుకొని కాలనీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కమిషనర్ ముందుగా కాలనీలో నివాసముంటున్న 76 ఇళ్ల కుటుంబాల వారితో మాట్లాడారు. తవిటమ్మ అనే వృద్ధురాలు అక్కడే నివాసితురాలుగా 50 సంవత్సరాలుగా కుటుంబంతో నివసిస్తున్నామని, ఈ ప్రాంతంలో ఉన్న అందరికీ ఇళ్ల పట్టాలు అందించాలని, వీధి లైట్లు వెలగక, మౌలిక సదుపాయాలు లేక నివాసితులంతా ఇబ్బంది పడుతున్నామని వివరిస్తూ ఆయా సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. సుమారు 20 ఇళ్లకు వర్షాలు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, కరెంటు సదుపాయాన్ని ఇపిడిసిఎల్ కల్పించలేనందున చీకట్లోనే నివసిస్తున్నామని కొంతమంది నివాసితులు కమిషనర్‌కు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ఇందిరా గాంధీ కాలనీ మురికివాడలో 76 కుటుంబాలు నగరంలో కూలి పనులు చేసుకుంటూ నివసిస్తున్నాయని, వారికి జివిఎంసి నుంచి ఇళ్లపట్టాలను మంజూరు చేయాలని మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

మురికివాడలో పర్యటిస్తున్న సంపత్ కుమార్

అనంతరం మురికివాడ ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ వీధిలైట్లను వెంటనే వెలిగేలా, అలాగే అవసరమగు మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజినీర్లు తారా ప్రసన్న, మురళీకృష్ణలకు, అలాగే ఆ ప్రాంతం పూర్తి వివరాలను, నివాసితుల వివరాలను వెంటనే సమర్పించాలని ఎసిపి శాస్త్రికి, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్‌లకు కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ బి.రాము, సహాయ వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

శభాష్ నితీష్

నితీష్ కుమార్ రెడ్డిని అభినందిస్తున్న సతీష్ బాబు

ప్రజాశక్తి - మధురవాడ : మెల్‌బోర్న్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీతో ఉత్తమ ఆటతీరు కనబరిచి అందరి దృష్టినీ ఆకర్షించిన విశాఖపట్నానికి చెందిన యువ క్రికెటర్ నితీశ్ కుమార్‌రెడ్డిని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ) కార్యదర్శి సానా సతీష్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొని వైజాగ్‌కు వచ్చిన నితీశ్ కుమార్‌రెడ్డి విశాఖలోని వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ) కార్యదర్శి సానా సతీష్-బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంగ్లాండ్-ఇండియా టి20 మ్యాచ్ సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీలకు కూడా నితీష్ సెలెక్ట్ అవుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తన ఆట తీరుతో, ఉత్తమ ప్రతిభతో విజయాలు నమోదు చేసి ఇటు రాష్ట్రానికి, అటు దేశానికి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు కీర్తి ప్రతిష్టలు పెంచేలా కృషి చేయాలని, ఆ దిశగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు, తోడ్పాటు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎసిఎ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటరామ ప్రశాంత్, కౌన్సిలర్ దంతు గౌర్ విష్ణు తేజ్, ఎసిఎ గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎంఎస్.కుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో ఏర్పాటు చేసిన నంది విగ్రహం, వాటర్ ఫౌంటెయిన్

లేపాక్షి జంక్షన్‌కు ఆధునిక సొబగులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్‌ను సరికొత్త అందాలతో తీర్చిదిద్దేందుకు జివిఎంసి చేపట్టిన కార్యాచరణలో భాగంగా లేపాక్షి జంక్షన్‌ను ఆధునికంగా తీర్చిదిద్దారు. అందులో భాగంగా లేపాక్షి మూడు రోడ్ల జంక్షన్ వద్ద పోలీస్ సర్కిల్‌ను తొలగించారు. జంక్షన్‌లో ఉండే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తీసివేశారు. ఈ స్థలంలో వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. ఫౌంటెన్ మధ్యలో నంది విగ్రహాన్ని ఉంచారు. నంది ముఖం జగదాంబ వైపు ఉండేలా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో లేపాక్షి షోరూమ్ ఉంది. సింబాలిక్‌గా దానిని దృష్టిలో ఉంచుకొని నంది విగ్రహం ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. వాటర్ ఫౌంటెన్‌తో పాటు లైటింగ్ సమకూర్చడంతో రాత్రి, పగలు తేడా లేకుండా ఈ జంక్షన్ ఎంతో అందంగా కనిపిస్తోంది. జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ సత్యనారాయణరాజు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ నగరంలో ప్రధాన కూడళ్లను తీర్చిదిద్దుతున్న కార్యక్రమంలో భాగంగా, జగదాంబ జంక్షన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే తెన్నేటి జంక్షన్ వద్ద క్లాక్ టవర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఆర్డరు Vరూల్ 20 ప్రకారం నోటీసు
మహారాజశ్రీ గాజువాక 13వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.No. 778/2024 A.S.No. /2023

వాది: నిమ్మగడ్డ సాంబశివరావు
Rep by. జి.పి.ఎ.హోల్డర్
కంభంపాటి శ్రీసత్యసాయి వెంకట నారాయణ ... అప్పెల్లెంట్

ప్రతివాదులు :
1. పిళ్లా వెంకటరావు (Died)
2. పిళ్లా రూప
3. పిళ్లా సాత్విక ... ప్రతివాదులు

టు:
1. పిళ్లా రూప, భర్త లేటు వెంకటరావు జయంతి రెసిడెన్సి, చినగంట్యాడ, గాజువాక, విశాఖపట్నం - 530026.
2. పిళ్లా సాత్విక, D/o. లేటు వెంకటరావు - డిటో - అడ్రస్

ఇందుమూలముగా మీకు తెలియజేయు నదేమనగా పైనెంబరు పిటిషన్‌లో మీరు కోర్టు వారు ఇందలి పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీ చేయుటకు ఆర్డరు వేసి మీ హాజరు నిమిత్తం **తే:27-01-2025దీకి** వాయిదా వేసియున్నారు. కావున మీరు పై తేదీన పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10.30 గం॥** హాజరుకావలెను. అట్లు హాజరుకాని పక్షంలో మీ పరోక్షములో పిటిషన్ విచారణ జరుగును.

వి.శ్రీనివాసరావు న్యాయవాది,
డో.నెం. 27-1-174/1, శ్రీనగర్,
గాజువాక, విశాఖపట్నం-26.
సెల్: 9848447029

బహిరంగ ప్రకటన

(భాగస్వామి సంస్థ రద్దు కోసం)

నా క్లయింట్, M/s. శ్రీనివాస థియేటర్ భాగస్వామ్య సంస్థ రిప్రజెంటెడ్ ఇట్స్ పార్టనర్స్ 1. శ్రీమతి వెల్లంకి దివ్యరెడ్డి, భర్త యగ్నేష్ భరత్, 2. శ్రీ తిప్పల గురుమూర్తిరెడ్డి, తండ్రి లేటు అప్పారావు, 3. శ్రీమతి తిప్పల వెంకట విజయకుమారి, భర్త గురుమూర్తిరెడ్డి మరియు 4. తిప్పల చంద్రమౌళి, తండ్రి గురుమూర్తి రెడ్డి, డో.నెం. 7-211, గ్రౌండ్‌ఫ్లోర్, మరిడిమాంబ గుడి దగ్గర, అగనంపూడి, విశాఖపట్నం వారు యావత్ ప్రజానీకానికి ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయబడు తున్నది ఏమనగా!

మా క్లయింట్, M/s. శ్రీనివాస థియేటర్ భాగస్వామ్య సంస్థ, దాని ప్రధాన కార్యాలయం డో.నెం. 7-211, గ్రౌండ్‌ఫ్లోర్, మరిడిమాంబ గుడి దగ్గర, అగనంపూడి, గాజువాక మండలం విశాఖపట్నం వద్ద ఉన్నది. సదరు భాగస్వామ్య సంస్థ తేది:11-02-2025 నుండి రద్దు చేయబడుతుంది. ఈ భాగస్వామ్య సంస్థ రద్దు పట్ల ఎవరికైనా, అభ్యంతరాలు, క్లెయిమ్స్, ఏదైనా సమస్యలు ఉన్న ఎడల వాటిని ఈ ప్రకటనలు వెలువడిన 30 రోజులు లోపు పైన పేర్కొన్న చిరునామాకు లిఖితపూర్వకంగా పంపగలరు.

ప్రస్తావించిన కాలవ్యవధి తరువాత ఎలాంటి అభ్యంతరాలు లేదా క్లెయిమ్స్ పరిగణలోనికి తీసుకోనబడవు అని ఇందుమూలముగా యావత్తు ప్రజానీకానికి తెలియజేయుటం అయినది.

A.V.LENIN, Advocate
H.No. 26-49-2/2, Road No.E,
Chaitanya Nagar, Gajuwaka,
Visakhapatnam-26
Cell : 9666108999
Gajuwaka
Dt. 10-1-2025

పిఎఫ్ బకాయి చెల్లించాలని వినతి

జెసిఎల్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : విజయనగరం జిల్లా నెల్లిమర్లలో జ్యూట్ మిల్ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ మంజూరు చేయాలని జ్యూట్ కార్మికుల యూనియన్, సిఐటియు కార్యదర్శి రామారావు కోరారు. శుక్రవారం జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నేత రామారావు మాట్లాడుతూ జ్యూట్‌మిల్ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ కట్టనందున ఒక్కో కార్మికుడు రూ.52వేలు బకాయి రావాల్సి ఉందన్నారు. ఆయా బకాయిలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగొచ్చి జ్యూట్ మిల్లు కార్మికులకు రావాల్సిన పిఎఫ్ బకాయిలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై జెసిఎల్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కాళ్ల అప్పలసూరి, శ్రామిక సంఘం ప్రెసిడెంట్ చిక్కాల వెంకట గోవిందరావు, జి నర్సింగరావు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు పటిష్ట నిఘా

ప్రజాశక్తి-మధురవాడ : సంక్రాంతి పండగకు నగరం విడిచి ఎక్కువమంది సొంతూళ్లకు వెళ్తున్న నేపథ్యంలో చోరీలు, ఇతర నేరాలు జరగకుండా నార్త్‌జోన్ స్టేషన్ పరిధిలో పక్కా నిఘా పెడుతున్నట్లు నేర విభాగం సిఐ ప్రకాష్ తెలిపారు. చిల్లర దొంగతనాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే అప్రమత్తమై సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగతనాల నివారణలో భాగంగా కాలనీల్లో ఫ్లెక్సీలు, ఆటోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత గ్రామాలకు వెళ్లే వారు ఇళ్ల భద్రత విషయం మరచిపోవద్దని సూచించారు. ఇంటికి తాళం వేసి వెళ్లే వారు విలువైన ఆభరణాలు, వస్తువులను బ్యాంక్ లాకర్లలో లేదా నమ్మకమైన వ్యక్తుల వద్ద ఉంచుకోవాలని సూచించారు. ఆపార్టుమెంట్లు, విద్యాసంస్థలు, బ్యాంకుల వద్ద పగలూ, రాత్రి కాపలా ఉండేలా భద్రతా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. నివాసాల్లో పనికి ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులను చేర్చుకొనే విషయంలోనూ, ఇళ్లను అద్దెకిచ్చేటప్పుడు, వాచ్‌మెన్లను నియమించేటప్పుడు వారి పూర్తి చిరునామా, ధ్రువపత్రాలను సేకరించాలని సూచించారు. ఎక్కువ రోజుల పాటు ఊరెళ్లే సమయంలో పక్క నివాసితులతో పాటు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. 0891 272333, సిఐ 8331041672, 9000220684 ఎస్ఐ 9440904314 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. సొంతూళ్లకు వెళ్లేవారు ఎల్‌డిహెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని స్టేషనుకు సమాచారం అందిస్తే అక్కడ ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటామని సిఐ ప్రకాష్ వెల్లడించారు.

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్
వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

గీతం ఎంబిఎ విద్యార్థులకు సమ్మర్ ట్రైనీ అవార్డులు

జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ ఆధారంగా ప్రకటన

జాతీయస్థాయి సమ్మర్ ట్రైనీ అవార్డులు పొందిన గీతం ఎంబిఎ విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ: ప్రముఖ మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఇ4 డెవలప్‌మెంట్ జాతీయ స్థాయిలో ఎంబిఎ విద్యార్థులకు నిర్వహించిన అంతం ్కళాశాలల సమ్మర్ ప్రాజెక్టు పోటీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు చెందిన ఐదుగురు ఎంబిఎ విద్యార్థులు ఉత్తమ ప్రాజెక్టు నివేదికకు గాను సమ్మర్‌ట్రైనీ అవార్డులను సాధించారు. గత ఏడాది వేసవిలో ఫైనలియర్ ఎంబిఎ విద్యార్థులు నిర్వహించే ప్రాజెక్టులపై జాతీయ స్థాయిలో ఇ4 డెవలప్‌మెంట్ సంస్థ ఈ పోటీలను నిర్వహించింది. ఆన్‌లైన్ విధానంలో జరిగిన పోటీల్లో దేశంలోని 60 నగరాలలోని 250 బిజినెస్ స్కూల్స్‌కు చెందిన 13 వేల మంది విద్యార్థులు పోటీ పడ్డారు. విద్యార్థుల ప్రాజెక్టుకు గల ప్రాధాన్యత, వ్యక్తిగత ఇంటర్వ్యూలో కనబరిచిన ప్రతిభ, మేనేజ్‌మెంట్ అంశాలపై విశ్లేషనాత్మక పరిణతి, విద్యార్థులకు మెంటార్‌గా వ్యవహరించే అధ్యాపకుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఈ అవార్డులను శుక్రవారం ప్రకటించారు. గీతం ఎంబిఎ విద్యార్థులు చెరుకూరి సితార, జి.వి.విజయరత్న ప్రవల్లిక, పి.అంకిత, ఎస్.జ్యోత్స్న, అలీఘలీ దేశంలోని 100 మంది నైపుణ్యం గల ఎంబిఎ విద్యార్థుల జాబితాలో ఎంబిఎ సమ్మర్ ట్రైనీ అవార్డుకు ఎంపికయ్యారని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు వెల్లడించారు. గీతంలోని యుజి, పిజి కోర్సులను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని, హర్వర్డ్ కేస్ స్టడి సిలబస్‌లో భాగంగా చేశామన్నారు. విద్యార్థుల ప్రతిభను, వారికి మెంటార్‌గా వెనక ఉండి మార్గదర్శకం వహించిన అధ్యాపకులను అభినందించారు. జాతీయ స్థాయి గుర్తింపు ద్వారా ప్రముఖ కార్పొరేట్ సంస్థలలో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించగలవన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

వాలంటీరు ఆత్మహత్యకు కూటమి ప్రభుత్వానిదే బాధ్యత

గాజువాకలో నిరసన తెలుపుతున్న వాలంటీర్లు

ప్రజాశక్తి- గాజువాక: తూర్పుగోదావరి జిల్లాలో వాలంటరీ గౌతమి ఆత్మహత్యకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరుతూ గ్రామ వార్డు వాలంటరీ అసోసియేషన్, సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పాత గాజువాక జంక్షన్‌లో కొవ్వొత్తుల పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గంధం దీప్తి మాట్లాడుతూ, ఇది ప్రభుత్వ హత్యగానే భావిస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు వాలంటీర్లకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చిన తర్వాత గౌరవ వేతనాలు పెంచకపోగా, ఏకంగా విధుల నుంచి తొలగించారన్నారు. నిరసన కార్యక్రమంలో లక్ష్మణ్, రాము, అజరుద్దీన్, సిఐటియు నాయకులు ఎ.లోకేశ్వరరావు, బంగారునాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆనందపురంలో ముక్కోటిఏకాదశి వేడుకల్లో ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -మధురవాడ : వైసిపి పాలనలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రాన్ని అపారమైన రాజకీయ అనుభవంతో ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిన పెడుతున్నారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జివిఎంసి ఏడో వార్డు ఎన్‌జిఒ కాలనీలో రూ.ఐదు కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, పార్కు పనులకుశంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో ఒక్క అభివృద్ధి పనిచేపట్టిన దాఖలాలు లేవన్నారు. 2014-19లో తాను మంత్రిగా నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో రూ.4,500 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు తొందర్లోనే మొదలవుతాయన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు, భీమిలి రోడ్ల విస్తరణ పనులు, మంచినీటి సరఫరా ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో చేపట్టనున్నట్లు తెలిపారు. 5, 6, 7 వార్డుల పారిశుధ్య కార్మికులకు దుస్తులను టిడిపి సీనియర్ నాయకుడు నాగోతి సత్యనారాయణతో కలిసి గంటా అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పిల్లా మంగమ్మ, లొడగల అప్పారావు, కూటమి నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకటరావు, వాండ్రాసి అప్పలరాజు, శాఖారి శ్రీనివాస్, గరే గుర్నాథ్, పిల్లా నరసింగరావు, నాగోతి నరసింహ నాయుడు, పసుపులేటి శ్రీనివాస్, మామిడి దుర్గారావు పాల్గొన్నారు.

రూ.2.08 లక్షల కోట్ల పెట్టుబడులు ఒక చరిత్ర

ఆనందపురం : ఒకేరోజు రూ.2.క్ష్మ8 లక్షల కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేసే పనులు చేపట్టడం ఒక చరిత్ర అని, తన మూడు దశాబ్దాల రాజకీయ చరిత్రలో చూడడం ఇదే మొదటిసారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం బోయపాలెం పైడాకాలేజీలో శరణ్య వెంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయడంలో ఎన్నడూ లేనంత స్థాయిలో పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని, దీని వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి ఎంతో ఉందన్నారు.. తిరుపతి తొక్కిసలాట ఘటన దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, స్థానిక నాయకులు తాట్రాజ్ అప్పారావు, వానపల్లి ముత్యాలరావు, మీసాల సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి బమ్మిడి ఉమా సూర్యనారాయణ పాల్గొన్నారు

టిడిపిలోకి ఎల్‌వి పాలెం సర్పంచ్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంళక్షణఙ లోడగలవానిపాలెం సర్పంచ్ లోడగల రాజేశ్వరి, రమణ దంపతులతోపాటు ఉపసర్పంచ్ ఈగల నాగరాజు, మాజీ వార్డు సభ్యులు లోడగల శ్రీను తదితరులు శుక్రవారం టిడిపి జెడ్‌పిటిసి తాట్రాజు అప్పారావు, బమ్మిడి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గత సర్పంచ్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రాజేశ్వరి చేసి గెలుపొందారు. అప్పుడు వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఆ పార్టీలోకి చేరారు.

నేరాలు ఘోరాలు

గంజాయితో ఇద్దరు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-రావికమతం: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ రఘువర్మ తెలిపారు. పోలీసుల కథనమ మేరకు, శుక్రవారం మండలంలో చిన్నపాచల సమీపంలో రెండు బైకులపై తరలిస్తున్న 5.5 కిలోల గంజాయి రావికమతం పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలివి. జివిఎంసి ఎనిమిదోవార్డు ఎండాడ ప్రాంతం లో సాయిశేషాద్రి బహుళ అంతస్థు భవనంలో ఎ.మోహన్‌కృష్ణ తన కుటుంబ సభ్యులతో నివాసముంటున్నారు. ఎప్పటిలాగానే కుటుంబసభ్యులంతా గురువారం రాత్రి ఎవరి గదుల్లోవారు నిద్రకు వెళ్లిపోగా శుక్రవారం ఉదయం మోహనకృష్ణ తనయుడు ఎ.సుధీర్ (19) నిద్రిస్తున్న గది తలుపు తట్టగా స్పందన లేకపోవడంతో, తలుపులు పగలగొట్టి లోపలకు వెళ్లి చూడగా, ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు.కిందికి దించి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు. మృతుడు డిప్లమో చదువుతున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

తిరుమల తొక్కిసలాట మృతులకు నివాళి

ప్రజాశక్తి- సీతమ్మధార :తిరుమల తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన ఉత్తర నియోజకవర్గం 55వ వార్డుకు చెందిన కండిపిల్లి శాంతి పార్థివ దేహానికి స్థానిక ఎమ్మెల్యే పి విష్ణుకుమార్‌రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేసియా ప్రకటించడంతోపాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం కల్పిస్తామని ఇప్పటికే ప్రకటించారన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి కూటమి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసానిచ్చారు. దహన సంస్కారాలకు ప్రభుత్వ ఆర్థికసాయం అందజేశారు.కార్యక్రమంలో గోపాలపట్నం తహశీల్దార్, ఉత్తర నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఉషాకిరణ్ ఈతలపాక సుజాత, అరుణ్‌బాబు, లెక్కల కృష్ణ, శ్రవణ్, టిడిపి జనరల్ సెక్రెటరీ నజీర్, కూటమి పార్టీల వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : తిరుమల శ్రీవారి వైకుంఠద్వార దర్శనాల టోకెన్ల జారీ కేంద్రం వద్ద తొక్కిసలాటలో మృతి చెందిన మద్దిలపాలెం రామాలయం వీధిలో నివసిస్తున్న గుడ్ల రజిని భౌతికకాయనికి కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రియాంక దండి నివాళులు అర్పించారు. రజిని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు కాండవ గాయత్రి, జగన్ మురారి, నాగరాజు పరామర్శించారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న జియ్యాని

తిరుమలలో శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల వేంకటేశ్వర స్వామిని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు శుక్రవారం తెల్లవారుజామున విఐపి ప్రోటోకాల్ దర్శన సమయంలో శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శ్రీవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

రెవెన్యూ సదస్సులకు 827 దరఖాస్తులు

ప్రజాశక్తి-పద్మనాభం. మండలంలోని 22 గ్రామపంచాయతీల పరిధిలో 25 రెవెన్యూ గ్రామాలకు గాను 21 రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో వివిధ సమస్యలపై 827 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

నిజాలు నిర్భయంగా రాసే ప్రజాశక్తి

కేలెండర్ ఆవిష్కరిస్తున్న సీపాన వెంకటరమణ

ప్రజాశక్తి-మధురవాడ : నిజాలు నిర్భయంగా రాయటంతో ప్రజాశక్తి దినపత్రికకు సాటి ఎవరూ రారని ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీపాన వెంకటరమణ అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో శుక్రవారం ప్రజాశక్తి నూతన సంవత్సర కేలెండర్‌ను కమిటీ సభ్యులు ఎండ బాబూరావు, కూన గోవిందరావు, రఘుపతి వెంకటరమణ, జి.వనజాక్షిలతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటున్న ప్రజాశక్తి పత్రిక, చిరు వ్యాపారులకు తక్కువ ధరకే ప్రకటనలను ప్రచురిస్తూ సహకరిస్తోందన్నారు. ప్రజల పత్రిక ప్రజాశక్తిని ఆదరించాలని కోరారు.

భరత్‌నగర్‌లో విద్యుత్ ఫీడర్ ఏర్పాటు

భరత్‌నగర్ విద్యుత్ ఫీడర్ ప్రారంభిస్తున్న ఎస్ఇ శ్యాంబాబు

ప్రజాశక్తి- గాజువాక :ఎపిఇపిడిసిఎల్ కూర్మన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్ ప్రాంతంలో విద్యుత్ వినియోగదారుల కరెంట్ కష్టాలను దృష్టిలో పెట్టుకుని భరత్‌నగర్ ప్రాంతానికి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 11కెవి ఫీడర్‌ను సంస్థ ఆపరేషన్స్ ఎస్ఇ శ్యాంబాబు శుక్రవారం ప్రారంభించారు. తరచూ విద్యుత్ అవాంతరాలను దృష్టిలో పెట్టుకుని, భరత్‌నగర్ ప్రాంతానికి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేయాలన్న సంస్థ ఆదేశాల మేరకు దీన్ని ఏర్పాటు చేశారు. దీని వలన భరత్‌నగర్ ప్రాంతంలోని సుమారు మూడు వేల గృహవిద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అవాంతరాల నుంచి విముక్తి కలిగి, నాణ్యమైన కరెంట్ అందుతుందన్నారు. కార్యక్రమంలో ఇఇ బికె.నాయుడు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి 'అనగాని' జన్మదిన వేడుకలు

పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వెంకటేష్ గౌడ్

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్య ప్రసాద్ జన్మదిన వేడుకలు శుక్రవారం గాజువాకలో జరిగాయి. ఉత్తరాంధ్ర సర్దార్ గౌతు లచ్చన్న గీత సహ కులాల యువజన సంఘం అధ్యక్షులు ఏకుల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, అనాథ పిల్లలకు పంచిపెట్టారు. అనంతరం వారికి అల్పాహారం అందజేశారు. పిల్లలకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, సంఘ నాయకులు నెల్లి అప్పలరాజు. పింకీ అభిషేక్. న్యాయవాది పోలవరపు రమణబాబు అనిపెద్ది ఈశ్వరరావు. సంజీవ్ ప్రసాద్. కారి కుమార్.బి రామారావు.మామిడి వాసు చల్లా సురేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

• ఎల్ఐసి, షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగుల ధర్నా • వినతిపత్రాలు అందజేత • షిప్‌యార్డు గేటు వద్ద బైఠాయింపు

ఎల్ఐసి కార్యాలయం వద్ద ధర్నాలో ఎంవిఎస్.శర్మ, పెన్షనర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎల్ఐసిలో దీర్ఘకాలంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఐసిఆర్ఎఎ) ఆధ్వర్యంలో ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం ఎదుట శుక్రవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోవడం సరికాదన్నారు. తక్షణం వేతన సవరణ చేపట్టి పెన్షన్‌ను నవీకరించాలన్నారు. మెడిక్లెయిమ్ స్కీమ్‌ను సవరించాలని కోరారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు ఎన్.కృష్ణమూర్తి, మాజీ ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, ఐసిఇయు ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో ఎల్ఐసి యాజమాన్యం, ప్రభుత్వాలు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నాయన్నారు. పబ్లిక్ సెక్టార్ జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్లకు 30 శాతం కుటుంబ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధి బృందం ఎల్ఐసి సీనియర్ డిఎం శారదా ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ధర్నాలో జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సాల్మన్ రాజు, ఎల్ఐసి క్లాస్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్య బాబు, ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రవి కుమార్ పాల్గొని పెన్షనర్లకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమానికి ఐసిఆర్ఇఎ ఉపాధ్యక్షులు బిటి.ప్రసాద్ అధ్యక్షత వహించారు.

బకాయి చెల్లించే వరకు పోరాటం ఆగదు

ములగాడ : తమకు రావాల్సిన బకాయిలు చెల్లించేవరకు పోరాటం ఆగదని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ యూనియన్ నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం షిప్‌యార్డు మెయిన్‌గేటు వద్ద 1997 నుంచి2010 వరకు రావాల్సిన రెండుశాతం బకాయిలు చెల్లించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. పెన్షనర్స్ అసోయేషన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్, షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులు అసోసియేషన సీనియర్ నేతలు యుఎస్ఎన్ వర్మ, ఎం.కుమారమంగళం మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదన్నారు. యాజమాన్యం తమ గోడు వినిపించుకోకపోవడంతో గేటు వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. ఎజిఎం (హెచ్ఆర్) కోటేశ్వరరావు ధర్నా ప్రదేశానికి వచ్చి వారంలోగా యాజమాన్యంతో సమావేశం ఏర్పాటుచేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ధర్నాలో జిఎస్ ఆనంద్‌కుమార్, ఎంవి రమణమూర్తి, బి.సత్యనాథ్, ఎన్.పట్నాయక్, సి హెచ్ తమ్మారావు, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

షిప్‌యార్డు గేటు వద్ద బైఠాయించిన పెన్షనర్లు

18న 'మిలీనియం సాఫ్ట్‌వేర్' క్యాంపస్ డ్రైవ్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సెంట్రల్ మేనేజర్ రవికుమార్

ప్రజాశక్తి- సీతమ్మధార : మిలీనియం సాఫ్‌వేర్ సొల్యూషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ ఇండియా కొత్త తరం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు ఎల్లప్పుడూ ఆహ్వానం పలుకుతోందన్నారు. దేశంలో టెక్, నాన్-టెక్ రంగాల్లో వేగంగా డిజిటలైజేషన్ పెరగడంతో డిమాండ్‌కు అనుగుణంగా ఏడాదికి దాదాపు పది లక్షల మంది వరకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల అవసరం అవుతున్నాయన్నారు. విద్యార్థులకు అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పాత్రలో సుమారు 50 ప్లేస్‌మెంట్‌లను రూపొందించడానికి మెసర్స్ భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, విశాఖపట్నం ఐటి సెజ్‌తో కలిసి ఈనెల18న మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. గడచిన 25ఏళ్లగా మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ జాబ్ మేళాలు, క్యాంపస్ డ్రైవ్‌లను నిర్వహించి, ఇప్పటి వరకు ఐదు లక్షల మందికి పైగా విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లను విజయవంతంగా కల్పించిందన్నారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి 60శాతం మొత్తంతో బిటెక్ సిఎస్ఇ విద్యార్థులు, సి పైథాన్, నెట్, ఫ్రేమ్‌వర్క్స్, హెచ్‌టిఎంఎల్, సిఎస్ఎస్, జావా స్క్రిప్ట్‌లో మంచి నైపుణ్యం ఉన్న కంప్యూటర్ సైన్స్, ఇతర గ్రాడ్యుయేట్లు ఈ క్యాంపస్ డ్రైవ్‌కు అర్హులని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ హెచ్ఆర్ మేనేజర్ బి.దివ్యజ్యోతి తెలిపారు. మెసర్స్ భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నంలో ఐటి, బిజినెస్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 18న ద్వారకానగర్‌లోని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ క్యాంపస్‌కి నేరుగా వచ్చి, లేదా hr@millennium-softsol.comకు రెజ్యూమ్‌లను పంపవచ్చని తెలిపారు. ఈ డ్రైవ్‌కు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని, గరిష్టంగా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు www.millenniumsoftsol.com వెబ్‌సైట్‌ను లేదా 9248753098 ఫోన్ నెంబర్‌ను

భెల్ ఇడికి అభినందన

భెల్ ఇడిని అభినందిస్తున్న ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ భెల్ యూనిట్‌కు జిఎంగా వచ్చినా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ప్రమోషన్ పొందిన జి సుబ్రహ్మణ్యంను శుక్రవారం ఇదే యూనిట్‌కు చెందిన ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇడితో కార్మిక సమస్యలపై చర్చించారు. దీనికి స్పందిస్తూ సమస్య పరిష్కారంలో తన వంతు కృషి, సహకారం అందిస్తానని ఇడి సుబ్రహ్మణ్యం హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జెటివి ప్రకాష్, వి.బాబూరావు ఎస్.జగన్నాధరావు, వి.నరసింహమూర్తి, పి.కనకారావు, సీతన్ననాయుడు, వారాడ ఆనందరావు, జి అచ్చన్నాయుడు, ఆర్ నాగేశ్వరరావు, అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ స్పోర్ట్ క్లబ్‌లో సంక్రాంతి ఆఫర్

విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లోని క్రీడా సామగ్రి, ఇన్‌సెట్లో క్లబ్ అధినేత బొడ్డేటి కాశీవిశ్వనాథం

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలో విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లో పలు క్రీడలకు సంక్రాంతి ఆఫర్స్ పెట్టినట్లు విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ అధినేత బొడ్డేటి కాశీవిశ్వనాథం తెలిపారు. సంక్రాంతి పండుగకు పిల్లలు పలు క్రీడల్లో ఉత్సాహం పాల్గొనేలా విధంగా గో కార్టింగ్, వాటర్ వరల్డ్, స్విమ్మింగ్ పూల్, 12డి థియేటర్, గియాంట్ స్వింగ్, 360 డిగ్రీస్ సైకిల్, రాకెట్ ఎజెక్టర్ వంటి పలు క్రీడలకు ఆఫర్స్‌తో పాటు ఒక మంచి ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12 నుంచి 20 వరకు అన్ని క్రీడా విభాగాలపై 20శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. విశాఖ ప్రజలు ప్రోత్సాహంతో ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక యూనిక్ టూరిజం ప్రాజెక్ట్ అవార్డు విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ దక్కడంపై హర్షం వెలిబుచ్చారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉందని, యువత దీన్ని సద్వినియోగం చేసుకుని, వ్యక్తిగత ప్రతిష్ఠతోపాటు రాష్ట్రానికి దేశానికి పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. సంక్రాంతి ఆఫర్లను విశాఖ ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

తారురోడ్లపై భోగి మంటలు వద్దు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: నగర ప్రజలు తారు రోడ్లపై భోగిమంటలు వేయరాదని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ శుక్రవారం పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జివిఎంసి నిధులతో నగర ప్రజల సౌకర్యార్థం వేసిన రోడ్లపై భోగిమంటలు వేయడం వల్లా రోడ్లపై తారు కరిగి గుంతలు ఏర్పడతాయన్నారు. నగర సుందరీకరణ కోల్పోవడమే కాకుండా, గోతుల రోడ్లపై రాకపోకలకు ప్రజలకు ఇక్కట్లు, మరోవైపు జివిఎంసికి ఆర్థిక నష్టం వాటిల్లుతుందన్నారు. భోగిమంటలు రోడ్లపై వేయకుండా మైదానం లేదా ఖాళీ ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

తారు రోడ్లపై భోగి మంటలు వేసే వారిపై జరిమానా విధించడమే కాకుండా చట్టపరమైన చర్యలు చేపడతామని కమిషనర్ హెచ్చరించారు. భోగి మంటలు తారు రోడ్ల పైన, పార్కుల్లో ఏర్పాటు చేయకుండా ప్రజా ప్రతినిధులు, పలు సంఘాల నాయకులు, నివాసిత సంక్షేమ సంఘాలు, ఎన్జీవోలు సహకరించి రోడ్లను పాడుచేయకుండా ఔత్సాహికులకు అవగాహన కల్పించాలని కోరారు.

'అలివిర'లో కార్మికునికి గాయాలు

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ రాంకీ ఎస్ఈజెడ్‌లోని అలివిర హెల్త్ యానిమల్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం ఓ కార్మికుడు గాయపడ్డాడు. ఈ పరిశ్రమలో పనిచేస్తున్న జిహాన్ ఆన్సర్ (21) అనే హెల్పర్ విధి నిర్వహణలో ఉండగా, డయా మిథైల్ సల్ఫేడ్ అనే రసాయనం ఆయన పొట్టపై పడడంతో పొట్టపై భారీ పొక్కులు ఏర్పడ్డాయి. దీంతో ఆయన్ను అగనంపూడి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు. ఈ విషయాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచింది.

వలస కార్మికులపై నిర్లక్ష్యం తగదు : సిఐటియు

వలస కార్మికుల పట్ల పరిశ్రమ యాజమాన్యాల నిర్లక్ష్యం సరికాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. అలివిర పరిశ్రమలో అసలు ప్రమాదం జరగలేదని యజామాన్యం బుకాయించడం దారుణమన్నారు. ఈ ప్రమాదంపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కుగానీ, పోలీసులు, రెవెన్యూ వారికి గాని తెలియచేయకుండా గోప్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. గాయపడ్డ కార్మికుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. వలస కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్, వలస కార్మికుల చట్టం అమలు చేస్తున్నారా, లేదా అనే విషయాలపై అధికారులు విచారణ చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు జిహాన్ ఆన్సర్

ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

విలువిద్య పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ : జిల్లా అర్చరీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలు శుక్రవారం ఘనంగా ముగిసాయి. రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో మెరుగైన ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశామని విశాఖపట్నం జిల్లా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్టుకు దేశయ్, లలిత్ సాయి, యశ్వంత్ నాయుడు, తేజేశ్వర్, పూర్వ రాథోడ్, నాభ్య ప్రభాత్, గణేష్, మణి రత్నం, హర్షవర్ధన్, సాయిమనస్వి, వైష్ణవి, ఆధ్య ఎంపికయ్యారు. వారికి జిల్లా అర్చరీ సంఘ ఉప అధ్యక్షులు సత్యనారాయణ, కోశాధికారి పి. భాస్కర్ అభినందనలు తెలిపారు. కోచ్‌లు కె గోవింద్, శివకుమార్‌లను జిల్లా ఆర్చరీ అధ్యక్షులు పి.సూర్య నారాయణ రెడ్డి అభినందించారు.

బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాగభూషణం

15న బౌద్ధ మేళాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న బొజ్జన్న కొండ వద్ద మహా బౌద్ధ మేళ జరుగుతుందని ఆ సంస్థ అధ్యక్షులు బల్ల నాగభూషణం తెలిపారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో శుక్రవారం బౌద్ధ మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. బుద్ధుని చిత్రపటానికి పూల మాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బౌద్ధ మేళాకు విశేషంగా ప్రజలు విచ్చేసి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ బౌద్ధమేళాలో ఆలిండియా బౌద్ధ సంఘ పూజ్య బౌద్ధ బిక్షువు (బుద్ధ గయ, నాగపూర్) వెనరబుల్ జ్ఞాన్ దీప్ మహాథేరో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని బౌద్ధ ధమ్మ సందేశాన్ని అందిస్తారని చెప్పారు. ముఖ్య అతిథులుగా స్థానిక ఎంపీ సిఎమ్.రమేష్, విశిష్ట అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ డాక్టర్ బివి.సత్యవతి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, కార్యవర్గ సభ్యులు కొత్తూర్తి రామారావు, బొడ్డు సోమరాజు, ఉజ్జి సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా బుద్దిస్ట్ సొసైటీ అధ్యక్షులు పల్లా బాబ్జి, సలహా సభ్యులు నేలపూడి బాలరాజు బౌద్ధాభిమాని లంకలపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

13న పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం (పి.జి.ఆర్.ఎస్.)ను జనవరి 13వ తేదీన బోగి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవిన్యూ డివిజినల్ అధికారి వై. సత్యనారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పై విషయాన్ని గమనించాలని కోరారు.

జ్యూట్ ఆధారిత ఉత్పత్తులను వినియోగించాలి

లా వర్సిటీ విసి ఆచార్య సూర్యప్రకాశరావు

జ్యూట్ బ్యాగులను చూపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-సబ్బవరం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు జ్యూట్ ఆధారిత ఉత్పత్తులను వినియోగించాలని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు అన్నారు. విశ్వవిద్యాలయం కార్యాలయ ఆవరణలో పెరికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన జ్యూట్ బ్యాగులను శుక్రవారం సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించిందని దానికి అనుగుణంగా మనమంతా ముందుకు సాగాలన్నారు. పాలిథిన్ ఉత్పత్తులు తయారు చేయుటలో ఉపయోగించే రసాయనాల వల్ల మానవాళికి పలు వ్యాధులు సంక్రమించడంతో పాటు ఆరోగ్యానికి హానికరమని పేర్కొన్నారు. జ్యూట్ ఉత్పత్తులు తయారు చేస్తున్న పెరికే ఫౌండేషన్ ఛైర్మన్ పెరికే వరప్రసాదరావును వీసీ అభినందించారు. పెరికే ఫౌండేషన్ ఛైర్మన్ వరప్రసాదరావు మాట్లాడుతూ మనం వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్ల వల్ల భూమి లోపల ఉండే భూసారం కోల్పోవడమే కాకుండా భూగర్భజలాలు తగ్గిపోతాయని తెలిపారు. ఈ ప్లాస్టిక్ 21 రకాల క్యాన్సర్‌లు రావడానికి కారణమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్, పిఎస్ టు రిజిస్ట్రార్ ఏ.గోపి, జేఏఓ సుదర్శన్, కార్యాలయ సిబ్బంది మురళి, వెంకటేష్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపలి : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ పరిధిలోని మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడంలో అధికారులు విఫలం చెందారని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కోన లక్ష్మణ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లాప్ మిత్రులు, లోడర్లకు 4నెలలుగా జీతాలు లేక ఆకలితో వారి కుటుంబాలు రోడ్లు పడ్డాయి తెలిపారు. సంక్రాంతి పండగ పూట కూడా కార్మికులు ఆకలితో ఉండే పరిస్థితి దాపురించిందన్నారు. బకాయి పడ్డ జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బంగారు రవికుమార్, నిమ్మకాయల నరసింహమూర్తి, ఎర్రంశెట్టి అప్పలరాజు, సింగంపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పెదపాడు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడు పొట్నూరు మల్లేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి గురువారం పెదపాడు గ్రామంలో పరవాడ డిఎస్‌పి కెవి సత్యనారాయణ తదితరులు విచారణ చేశారు.

ఊరెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : సంక్రాతి పండగకి ఊరికి వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక సీఐ అల్లు స్వామి నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంక్రాతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ఊరికి వెళ్లాల్సి వస్తే వారు తమ విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని, లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలని సూచించారు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదని, తమతో పాటే తీసుకెళ్లాలన్నారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం ఏర్పాటు చేసుకోవలన్నారు. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలని, తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేర్లు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలని, ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్‌తో లాక్ వెయ్యడం మంచిదని తెలిపారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 100కి సమాచారం అందించాలని సీఐ కోరారు.

మాట్లాడుతున్న సిఐ స్వామినాయుడు

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు ఆదిరెడ్డిపాలెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎంపీపీ బోకం సూర్య కుమారి, ఎంపీటీసీ బైలపూడి దేముడు బాబు, గ్రామపెద్దలు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సీసీ రోడ్డు రామాలయం వద్ద కోటాన కిష్టమ్మ ఇంటి నుండి గండి కనకాలు ఇంటి వరకు ఎంపీపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మాణం చేస్తున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, స్థానిక నాయకులు ఆదిరెడ్డి రమణ, కోటాన అప్పారావు, ఆదిరెడ్డి పోతురాజు, కోటాన కోటేశ్వరరావు, కామిరెడ్డి ముత్యాలనాయుడు, బైలపూడి సత్యం, గండి కనకాలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి సూర్యకుమారి

డావిన్సీలో క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక, అచ్యుతాపురం

మునగపాక మండలం తిమ్మరాజుపేట గ్రామంలో డావిన్సీ అంతర్జాతీయ పాఠశాలలో 'డావిన్సీ ఉత్సవ్' పేరుతో నిర్వహిస్తున్న క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.రామ్మూర్తి, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, గ్రామ సర్పంచ్ మంగ లక్ష్మి, ఎస్ భాగ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు క్రికెట్, ఖోఖో జూనియర్స్, బాస్కెట్ బాల్ జూనియర్, సీనియర్ అథ్లెటిక్స్, రన్నింగ్, లాంగ్ జంప్, స్కేటింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు 78వ కార్పొరేటర్ డాక్టర్ గంగారావు, శిరిడి సాయి లా కాలేజీ ప్రతినిధి విద్యార్థి వెంకట్రావు, పూర్వపు మండల విద్యాశాఖ అధికారి ఎస్ తమ్మిరాజు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రత్యేకమైన సాంస్కతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం పలువురు వక్తలు ప్రసంగించారు. కార్యక్రమాలను వీక్షించేందుకు తల్లిదండ్రులు, చుట్టుపక్క గ్రామాల వారు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డావిన్సీ ఇంటర్నేషనల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య, డైరెక్టర్ జె రమణాజీ, డాక్టర్ కాండ్రేగుల యశ్వంత్ కుమార్, పూర్వపు వ్యాయామ ఉపాధ్యాయుడు కేఎన్‌వి సత్యనారాయణ, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎం.వెంకట అప్పారావు, కర్రి స్వామిబాబు, పాఠశాల ప్రధానాచార్యులు మీనా మిశ్రా, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలతో డాక్టర్ బి.గంగారావు, కర్రి సుందరయ్య, తదితరులు

సెక్యూరిటీ గార్డ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎపిఎస్ఇజెడ్‌లోని వినూత్న ఫార్మా పరిశ్రమలో పనిచేసిన సెక్యూరిటీ గార్డు సుభాన్ సుదాన్స్ కుమార్ సాకే మృతి చెందడంపై సమగ్ర విచారణ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అతని మృతి అనుమానాస్పదంగా ఉందని, పలు సందేహాలు నెలకొంటున్నాయని, కావునా విచారణ జరపాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి యాజమాన్యం పరిహారం చెల్లించాలని కోరారు.


బహుమతులు అందిస్తున్న మళ్ల సురేంద్ర

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-అనకాపల్లి : సంక్రాంతి సంబరాల్లో భాగంగా అనకాపల్లి ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఎంపీ సీఎం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించి జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర చేతుల మీదుగా శుక్రవారం బహుమతుల ప్రదానం చేశారు. క్రికెట్‌తో పాటు వాలీబాల్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం రమేష్ ఆఫీస్ టీం విజయ్, స్వరూప్, పార్టీ నాయకులు పైల గోపి, దాడి బుజ్జి, బుద్ద జోగినాయుడు, భాను చంద్ర, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

12న పల్లె పండగ కార్యక్రమం

ప్రజాశక్తి-సబ్బవరం : ఈనెల 12న మండలంలోని పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో పి.పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బోదువలస, ఎల్లుప్పి, తవ్వవానిపాలెం గ్రామాలలో పల్లె పండగ కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. గోకులం షెడ్లు ప్రారంభం, వరి ధాన్యం సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-మునగపాక : గ్రామంలో తాగునీరు కల్పన, పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్‌లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను జెసిబి సహాయంతో తొలగించే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పారిశుధ్య కార్మికులతో చేయి కలిపి పనిచేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు పాలకవర్గంతో కలిసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ కోయిలాడ రామచంద్రరావు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్.శివరాంపురం గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. మెయిన్ రోడ్‌లో సామాజిక అవసరాల నిమిత్తం కేటాయించిన స్థలంలో గ్రామానికి చెందిన నమ్మి అప్పయ్యమ్మ నమ్మి రాజు తదితరులు ఆక్రమణలు చేశారు. ఈ స్థలంలో గల ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

బిసిటి శాస్త్రవేత్తలు శ్రీహరిరావు, ప్రసాదరావు

ప్రజాశక్తి-కశింకోట

నువ్వుల పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు రెట్టింపు చేసుకొని అధిక నికర ఆదాయాన్ని పొందవచ్చునని బిసిటి - కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీహరిరావు, వి.ప్రసాదరావు అన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం తాళ్ళపాలెం గ్రామ రైతు సేవ కేంద్రం వద్ద నూనె గింజల పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూనె గింజల పంటలలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో భాస్వరాన్ని ఎకరాకు 50 కిలోలు ఆఖరి దుక్కిలో వాడడం ద్వారా నూనె శాతాన్ని పెంచవచ్చునని వివరించారు. విత్తనానికి ట్రైకోడెర్మావిరిడితో శుద్ధి చేయడం, ట్రైకోడెర్మావిరిడి పొడిని ఎకరాకు రెండు కిలోల చొప్పున ఆఖరి దుక్కిలో పశువుల గెత్తంతో కలిపి చల్లడం ద్వారా నేల ద్వారా వచ్చే వేరు కుళ్ళు, కాండం కుళ్ళు తెగుళ్లను అరికట్టవచ్చునని తెలిపారు. విత్తిన 48 గంటలలోపు ఎకరాకు ఒక లీటరు పెండిమిథాలిన్ కలుపు మందును పిచికారి చేయడం ద్వారా వెడల్పాకు కలుపు మొక్కలను రాకుండా చేయవచ్చునని సూచించారు. అనంతరం శారదా రకం నువ్వుల విత్తనం రైతులకు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, టిడిపి కూటమి నాయకులు కాయల మురళీ, అప్పికొండ అప్పారావు, కర్రి గోవింద, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నువ్వులు యాజమాన్య పద్ధతులు చూపుతున్న శాస్త్రవేత్తలు

అధ్యయనంతోనే మంచి రచనలు సాధ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : అధ్యయనం ద్వారానే మంచి రచనలు చేయడం సాధ్యమవుతుందని ప్రముఖ కథారచయిత రంగబాబు అన్నారు. అనకాపల్లి సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని, సంక్రాంతిని ఆహ్వానిస్తూ శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో సాహితీ సమావేశం సంస్థ కన్వీనర్ గొంతిన రంగబాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మరణించిన ప్రముఖ సాహితీ వేత్త, కవి, రచయిత మళ్ళ భువనేశ్వరరావుకి సభ ప్రారంభంలో నివాళులర్పించారు. అనంతరం డిసెంబర్ 28 , 29 తేదీలలో విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల విశేషాలను కవులు మాధవీ సనారా, కోరాడ అప్పలరాజు వివరించారు. అనంతరం నిర్వహింపబడిన కవిసమ్మేళనంలో డాక్టర్ యిమ్మిడిశెట్టి చక్రపాణి, మాధవీ సనారా, అమర జ్యోతి, రాజా గణేష్, కర్రి మల్లీశ్వరి, బల్లా నాగ భూషణం, జి ఎల్ ఎన్ శాస్త్రి, బుద్ద వీరు నాయుడు, వజ్రపు త్రినాథ రావు, కోరాడ అప్పలరాజు, సాయిబాబా తదితరులు పాల్గొని తమ కవితలు, సందేశాలు వినిపించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సి చోడవరం, మాడుగుల చైర్మన్‌గా నవకుమార్

ప్రజాశక్తి-చోడవరం : జాతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (భారత ప్రభుత్వం ఆమోదించిన సంస్థ) చోడవరం, మాడుగుల నియోజకవర్గాల చైర్మన్‌గా దేవరపల్లి నవకుమార్‌ను నియమిస్తూ జాతీయ మానవహక్కుల కౌన్సిల్ చైర్మన్ పి.సంపత్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చోడవరం మాడుగుల నియోజకవర్గ పరిధిలోని చోడవరం, బుచ్చయ్యపేట రావికమతం, రోలుగుంట, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు చైర్మన్ పదవిలో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారని తెలిపారు.

రామాలయ పునర్నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో శ్రీకోదండ సీతారామ ఆలయం పునర్నిర్మాణానికి ఆదిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సబ్బవరం ఎంపిటిసి- 2 బైలపూడి దేముడు రూ.50,000 విరాళాన్ని ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ మేరకు బైలపూడి దేముడుకు ఆలయ కమిటీ ప్రతినిధులు బోకం రామనాయుడు, బండారు శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, బైలపూడి సత్యం, బైలపూడి శ్రీరాములు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దోప్పర్ల శివారు రాయగరువు గ్రామంలో శుక్రవారం హెరిటేజ్ డెయిరీ నూతన పాల సేకరణ కేంద్రాన్ని టిడిపి గ్రామ నాయకుడు కొల్లి సన్నిబాబు, హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కె.శేషు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీలో పాలు పోసిన రైతులకు డెయిరీ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు. పాడి పశువులకు ప్రమాద బీమా సదుపాయం, సహజ మరణ బీమా అమలు చేస్తున్నట్లు చెప్పారు. పాల సేకరణకు జిల్లాలో అన్నింటి కంటే అధిక రేటు హెరిటేజ్ డెయిరీ చెల్లిస్తుందని, ఏడాదికి రెండుసార్లు బోనస్‌లు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటరావు, కే వరలక్ష్మి, పి.రవణమ్మ, కె.దేవి, ఎం.సన్యాసిరావు, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించిన టిడిపి నేత సన్నిబాబు

ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

బారులు తీరిన భక్తులు


ఉపమాక వెంకటేశ్వరస్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి-నక్కపల్లి

ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సుదూర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొండపైన, దిగువున ఉపాలయాల్లోనూ స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం తెల్లవారు జాము నుండి సాయంత్రం వరకు భక్తుల రద్దీతో కిటకిటలాడింది.క్యూ లైన్ లో భక్తులు బారులు తీరారు. సాయంత్రం 8 వాహనాల్లో తిరువీధి సేవ ఘనంగా నిర్వహించారు. సీఐ కుమారస్వామి, ఎస్ ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డిఎస్‌పి మోహన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నర్సీపట్నం టౌన్ : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలో వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అబిద్ సెంటర్లో వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పలువురు భక్తులు దర్శనం చేసుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాల దగ్గర బారులు తీరారు.

కశింకోట : కశింకోట సీతారామ దేవాలయం, నర్సింగబిల్లి వెంకటేశ్వర ఆలయం, గొబ్బూరు రామాలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరిగాయి. ఉదయం పూజలు జరిపి తీర్ద ప్రసాదం స్వీకరించారు. పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పూజలు చేశారు.

మునగపాక : మండలంలోని నాగులపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ పూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని గ్రామ పెద్దలు ఆహ్వానం మేరకు ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పెంటకోట విజయ్, దాడి ప్రకాష్, కర్రి వాసు, మళ్ల అప్పలనాయుడు, మళ్ల గోవిందం, కాంగ్రెస్ వెంకట్, మొల్లేటి రాంజీ,విల్లూరి సాయిరాం పాల్గొన్నారు.

పద్మనాభం: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని స్థానిక అనంత పద్మనాభ స్వామి ఆలయ ప్రాంగణంలో కుంతీమాధవ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఇఒ నానాజీ బాబు ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు సీతారామాంజనేయ స్వామి భక్తులకు ప్రత్యేక పూజలు చేసి, స్వామిదర్శనాన్ని కల్పించారు పుష్పగిరి వేణుగోపాల్ స్వామి ఆలయంలోనూ సుగర్ ఫ్యాక్టరీ దరి వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ ఉత్తర ద్వార దర్శనాన్ని కల్పించారు.

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న టిడిపి నేత సాయికృష్ణ

గిరి ప్రదక్షిణ

యలమంచిలి : శ్రీవీరన్న వెంకటేశ్వరస్వామి వైకుంఠ ఏకాదశ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గిరిప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రదక్షిణలో భాగంగా దిమిలి, కొత్త ఎర్రవరం గ్రామాలకు చెందిన మహిళా భక్తులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. పల్లకి సేవలో ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కరణం నాగరాజు, సభ్యులు శెలంశెట్టి సూర్యప్రకాష్, కట్టా వెంకట సత్యనారాయణ, ప్రగడ సత్యనారాయణ, యోగా టీచర్ మళ్ల రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే బస్టాండ్ సమీపంలో ఇటీవల ప్రతిష్టించిన ఏడు వారాల వెంకటేశ్వరస్వామి ఉత్తరద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొత్తపాలెం, తులసీనగర్, పాతవీధి రామాలయాల్లో కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దైవ భక్తిని చాటుకున్నారు

పల్లకిలో స్వామివారి విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

నిల్వ ఆహార పదార్థాలతో విద్యార్థులకు అస్వస్థత

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ముక్కిన బియ్యం

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ వేములపూడి కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మూడు రోజుల క్రితం నిలువ ఆహారం తీసుకోవడంతోనే వాంతులు, విరోచనాలతో అస్వస్థకు గురయ్యారు. స్థానిక పీహెచ్సీ సిబ్బంది మరియు డిఎంహెచ్ఓ రమాదేవి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉండి బాగుంటే ఇంటికి పంపిస్తామని, లేదంటే అబ్జర్వేషన్‌లో ఉంచుతామని తల్లిదండ్రులకు సిబ్బంది తెలియజేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుండి ఇంటికి తీసుకెళ్లాం అనుకున్న తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు.

కస్తూర్బా పాఠశాలలో పులిహార జావలాగా ఉంటుందని, చట్నీ, కూర వంటి పదార్థాలు తినలేక పోతున్నామని విద్యార్థినులు మీడియా ముందు వాపోయారు. వంటశాలలో పట్టులు పట్టిన బియ్యం కనిపించాయి. నిల్వ గుడ్లు తినడంతో వాంతులు, విరోచనాలు పట్టుకున్నట్లు విద్యార్థులు తెలియజేశారు.

మండలంలో కస్తూరిబా, గురుకుల పాఠశాల, ఏపీ ఎంజేపీ పాఠశాల, బాలయోగి బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయి వీటిని ఉన్నతాధికారులు ఏ రోజు కూడా సందర్శించక పోవడంతోనే ఇటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయనే తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

హెటిరో ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని కాగిత గ్రామంలో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఆధ్వర్యంలో సి ఎస్ ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను శుక్రవారం కంపెనీ ప్రతినిధులు ఎస్.కుబ్బాయి రెడ్డి, ఎమ్.సుబ్బారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి ఆదేశాల మేరకు కోట్లాది రూపాయలతో పలు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, వాటర్ ప్లాంట్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కాగిత గ్రామంలో 10 లక్షల నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధి చింతల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:మండలంలో దిబ్బిడి, బుచ్చయ్యపేట గ్రామాల్లో ఉపాధి హామీ నిధుల నుండి నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ ఎస్ రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అనంతరం గ్రామస్తులు సన్మానం చేశారు. గ్రామంలో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ మండపం, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవనం, సి సి రోడ్డుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు, దొంకిన అప్పలనాయుడు, ఎంపీడీఓ విజయలక్ష్మి, పాల సంఘం అధ్యక్షులు ముమ్మిన సూర్యనారాయణ, సానపతి శ్రీనివాసరావు, పెదిరెడ్ల రాజు, ముమ్మిన నాగరాజు, సానపతి మణికంఠ, సుంకర శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: రోలుగుంట మండలంలోని పలు అభివృద్ధి పనులకు గాను చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అర్ల పంచాయతీ నుండి పితురి గెడ్డ వెళ్లే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే కె.నాయుడుపాలెం గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్డను, శరభవరం గ్రామంలో సీసీ రోడ్లను ప్రారంభించారు. రూ.4కోట్ల 10లక్షలతో అర్ల నుంచి పితురి గెడ్డ వరకు ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. రెండు మూడు నెలల్లో రహదారి పనులు పూర్తవుతా యన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల పార్టీ నాయకులు గుములూరు చంద్రమౌళి, సుర్ల రామకృష్ణ, చంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌పిఎస్ఎస్ యాప్‌తో రైతులకు మేలు

ప్రజాశక్తి -రావికమతం:ఎన్‌పిఎస్ఎస్ యాప్ ను (national pest survival lance system) రైతులందరూ మొబైల్‌లో డౌన్లోడ్ చేసుకోవాలని కొమీర సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్ శరత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ప్రతిక విలేకరులతో మాట్లాడుతూ, రైతులు పండించే పలు రకాల పంటలకు ఏదైనా తెగుళ్లు, చీడపీడలు, పురుగులు సోకినప్పుడు రైతులు యాప్ లో ఫోటో తీసి అప్లోడ్ చేస్తే వాటి నివారణ చర్యలు సూచనలు అందిస్తారన్నారు. ప్రతి ఒక్క రైతు తప్పకుండా ఇన్స్టాల్ చేసుకోవాలని ఆయన కోరారు.

ఆలయ ప్రహరీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం సాలూరు కృపానిధి దంపతులు, స్థానిక ఎంపీటీసీ ముమ్మని రవణ బాబు శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణం పనులు ఎంపీటీసీ నిధులు రెండు లక్షల రూపాయల నగదుతో ప్రారంభించామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు,పడాల అప్పలనాయుడు, రాయపు రెడ్డి కొండలరావు, పడాల వెంకటరాజు, పోతిన జగదీష్, మద్య యేసు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్

యంత్రంలో చెరిపి వేస్తున్న సిబ్బంది

సరిహద్దు రాళ్లపై జగన్ ముద్రలు చెరిపివేత

ప్రజాశక్తి-కోటవురట్ల: గత వైసిపి ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే లో భాగంగా సరిహద్దురాళ్లు ఏర్పాటు చేయగా వాటిపై జగన్ ముద్రలు, రాతలను కూటమి ప్రభుత్వం తచెరిపి వేసే చర్యలు చేపట్టింది ఇందులో భాగంగా గురువారం కోటవురట్ల గ్రామంలో సర్వే రాళ్లపై ముద్రలను ఎలక్ట్రానిక్ హ్యాండ్ మిషన్ తో చెరిపివేస్తున్నారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 13 గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహించి 11 గ్రామాలలో సర్వే రాళ్ల ప్లాంటేషన్ నిర్వహించారు. ఇందునిమిత్తం 15,280 రాళ్లను సిద్ధం చేయగా, 12612 రాళ్ళ ప్లాంటేషన్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఒక్కో సర్వే రాయి ప్లాంటేషన్ కు 150 రూపాయలు చొప్పున చెల్లించగా 18,91,800 లక్షలు ఖర్చు చేశారు. తిరిగి పేర్లను చెరిపి వేసేందుకు ఒక్కొక్క స్టోన్ కి దాదాపు 15 రూపాయలు వరకు చెల్లిస్తున్నట్లు తెలిసింది.

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రారంభిస్తున్న వైస్ ఎంపిపి

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని చోద్యం గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద మండల పరిషత్ నిధులతో మండల వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ అధ్వర్యంలో బోరు బావి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొండల రాజు, చోద్యం వైసీపీ అధ్యక్షులు పోతల సత్తిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలో గుడ్డిప పంచాయతీలో రెండు చేతి పంపు బోర్ల పనులను గొంప ఎంపీటీసీ గెంజి సూర్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిషత్తు నిధులతో మండలంలో గుడ్డిప కొత్తూరు శ్మశాన వాటిక, కొరుకొండ పాకల వద్ద బోర్ల పనులు ప్రారంభించారు. పశువుల పాకలకు ప్రతిరోజు ఇంటి వద్ద నుంచి మంచినీరు తీసుకు వెళ్లాలంటే చాలా కష్టమని, వీటి ఏర్పాటుతో ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న అప్పలనాయుడు

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:పట్టణంలోని బీసీ కాలనీలో బాల సదనంలో 60 మంది విద్యార్థినులకు ఎస్ఎవన్ కళాశాల వ్యవస్థాపకులు సూరెడ్డి అప్పలనాయుడు ఉచితంగా దుప్పట్లు అందజేశారు. ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. తిరుపతికి చెందిన పీపుల్స్ చారిటీ ఆర్థిక సహకారం అందించారని ఫౌండర్ పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లోరినేషన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

వాటర్ ట్యాంకుల క్లీనింగ్

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సీహెచ్. నాగాపురంలో శుక్రవారం మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేశారు. ట్యాంకులను పరిశుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు దగ్గరుండి పర్యవేక్షించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య దృష్ట్యా క్లోరినేషన్ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కాశీవిశ్వనాధరావు సూచించారు. శుక్రవారం జలూరు గ్రామంలో స్వచ్ఛతా హే కార్యక్రమంలో భాగంగా జల్లూరు నుండి కొత్తపల్లి ప్రధాన రహదారిని అనుకుని పేరుకు పోయిన చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్ డి.రఘురాం, కార్యదర్శులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని గుండుపాల గ్రామ పంచాయతీ గుండుపాల - జి.కొత్తూరు జంక్షన్‌లో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంను శుక్రవారం నిర్వహించారు. మెయిన్ రోడ్డులో ఉన్న చెత్త కుప్పలను స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు చేపట్టారు. స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాగు రాజు, మాజీ ఎంపీటీసీ రవివర్మ, టీడీపీ నాయకులు జి.చిన్నబ్బాయి, వార్డు సభ్యులు రొంగల చంటి, వార్డు సభ్యులు మేడిశెట్టి శివ, ఎంపిడిఓ కార్యాలయ ఏవో సత్యనారాయణ, ఈఓపిఆర్డీ శ్రీనివాస్, గుండుపాల పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి, వెలుగు ఏపీఎం కరుణానిధి పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న తహశీల్దార్

ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

ప్రజాశక్తి -కోటవురట్ల:రెవిన్యూ సదస్సులో అందిన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని తహసిల్దారు తిరుమలబాబు ఆదేశించారు. శుక్రవారం రెవిన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలోఆయన మాట్లాడుతూ, నిర్దేశించిన గడుగు ముగిసేలోపు ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో 415 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదును పీజిఆర్ఎస్ పోర్టల్‌లో పొందుపరిచామన్నారు. ప్రధానంగా మ్యూటేషన్, రీ సర్వే సమస్యలు అధికంగా అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, సర్వేయర్ శ్రీనివాస్, ఆర్ఐ ఊర్ధవరావు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సూచనలు ఇస్తున్న సిఇఒ

జెడ్‌పి సిఇఒ పర్యటన

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట, జానకి రాంపురం గ్రామాల్లో జిల్లా పరిషత్ ముఖ్య నిర్వహణాధికారి పీ.నారాయణమూర్తి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో సీపీడబ్ల్యూ స్కీమ్ ట్యాంకులను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి ఎంపీడీఓ సూర్యనాగేశ్వరరావు తో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రమేష్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాఖ కలెక్టరేట్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళా మణుల సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో విజ్ఞాన కేంద్రం సమీపాన ఉన్న లలిత కాలనీకి చెందిన మహిళలు, పిల్లలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు, పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ఇంచార్జి వి.ఎస్ పద్మనాభరాజు, కార్యక్రమాల బాధ్యులు జి.ఎస్ రాజేశ్వరరావు, ఎం.ఎల్లాజీ,సిహెచ్ సత్యనారాయణ, ఎం.ఆర్.డి రాజు, వై.సత్యనారాయణ లు పాల్గొన్నారు..ఈ సందర్భంగా వి.ఎస్ పద్మనాభరాజు, మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాలను, అందిస్తున్న సేవలను వివరించారు. జి.ఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విజ్ఞాన కేంద్రంగా నిర్వహించే శివరాత్రి, ఉగాది సంబరాల్లో కూడా ఇదే ఉత్సాహంతో పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. ఎల్లాజీ వందన సమర్పణ చేశారు.

నక్కపల్లిలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభం గ్రామంలోని అనంతపద్మనాభ స్వామి ఆలయ ప్రాంగణంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా గుడిలోవ సరస్వతి విద్యా విహార్ పాఠశాల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి పద్మనాభం ఎంపిపి కె.రాంబాబు పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి, అభినందించారు.. ఆలయం ఇఒ ఎస్ నానాజీబాబు, ఎంపిడిఒ విజయ్‌కుమార్ పద్మనాభం ఎంపిటిసి లక్ష్మీ నాయుడు., బిహెచ్ పురం ఎంపిటిసి సావిత్రి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 59వ వార్డు ములగాడ హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రతిభ పాఠశాలలో ప్రిన్సిపల్ వెంకటరమణ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ దుస్తులలో వచ్చిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను స్కూల్ అధ్యక్షులు లక్ష్మీ లావణ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. భోగి మంటలు, సోదెమ్మ, హరిదాసు, కొమ్మదాసు, తప్పెటగుళ్ళు, కోలాటం, కోయ డ్యాన్స్ వేషధారణలు అలరించాయి.

తగరపువలస: స్థానిక బాసర లీడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో సంక్రాంతి సంబరాల సందర్భంగా భోగి మంటలు వేశారు. అందంగా అలంకరించినబొమ్మల కొలువు, భోగి పళ్ల వేడుక, కోలాటం ప్రదర్శన ఆకట్టుకున్నాయి. జోనల్ ప్రిన్సిపాల్ వివిడి రమేష్, డిఫెన్స్ ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ రేఖ, డీన్ ఎం భాస్కర రావు, హెచ్‌ఎం కేశవ్ పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : కంచరపాలెం మెయిన్ రోడ్‌లోని గిరీషా శ్రీచైతన్య స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి ప్రిన్సిపాల్ అనురాధ, స్కూలు యాజమాన్యం ఆధ్వర్యంలో స్కూల్లో పాటలు ,జానపద గేయాలు, డాన్సులు, పలుకార్యక్రమాలతో అలరించారు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు

నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బోగి మంటలు, సాంప్రదాయ వంటకాలు, గొబ్బెమ్మలు రంగుల ముగ్గులు, హరిదాసుల మధ్య విద్యార్థినుల ఆటపాటలతో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భానుమూర్తి, అకడమిక్ ఇంచార్జి శ్రీ లక్ష్మి, పాల్గొన్నారు.

మాడుగుల:మాడుగుల జవ్వాది గెడ్డ జంక్షన్‌లో శ్రీ విజ్ఞాన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో సంక్రాంతి ఉట్టి పడేలా రంగురంగుల రంగవల్లులుతో అలంకరించారు.మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, దంగేటి సూర్యారావు, భారత నిర్మాణసేన సభ్యులు గౌరిపట్టపు మహేష్‌లు విద్యార్థులకు సంక్రాంతి ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యమ్రంలో ప్రిన్సిపాల్ పైలా కొండలరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, టీ.ఈశ్వరరావు, ఉపాధ్యాయులు ఫాల్గొన్నారు.

కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులు గాలి పటాలు ఎగరవేశారు. ముగ్గులు వేశారు. చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ రివనన్ కెనన్ జాన్, డైరెక్టర్ బత్తులు నోబెల్ కుమార్, కరస్పాడెంట్ బత్తులు అనురాధ, ప్రిన్సిపాల్ రూపనంది, సాజీదా, అకాడిమిక్ ఇన్ చార్జ్ చంద్రమౌళి, విద్యార్థులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శ్రీగాయత్రి హైస్కూల్‌లో సంక్రాంతి, భోగి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు భోగి పళ్ళు, భోగి మంట వేశారు. కరస్పాండెంట్ రామ్‌కుమార్, హెచ్‌ఎం నగేష్ పాల్గొన్నారు.

విశాఖలో ముగ్గులు వేస్తున్న మహిళలు

మునగపాక : స్థానిక ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సంక్రాంతి శోభ ఉట్టిపడేలా విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. బాలికలు వేసిన రంగవల్లులు కనువిందు చేశాయి. సంప్రదాయ నృత్యాలు, సేవ గరిడీలు పండగ వాతావరణం తలపించాయి. పతంగులు ఎగరవేసి కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీరు నాయుడు పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో సంక్రాంతి వేడుకల్లో భాగంగా చిన్నారులు హరిదాసు, గంగిరెద్దు వేషంలో ఆలరించారు. పశువులు, కోడి పుంజులు, పాలు పొంగే బొమ్మలతో ప్రాంగణాన్ని అలంకరించారు. ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, ఉపాధ్యాయులు పూజిత, వినీలా, లీలా, డైరెక్టర్ పి.ఉదయా నాగశ్రీ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రతిభ విద్యాలయంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా డూ డూ బసవన్న, గంగిరెడ్డి విన్యాసాలు, హరిదాసు వేశధారణ, రంగవల్లులు, భోగి మంటలు, భోగి పళ్ళు పోయుట, గాలిపటాలు ఎగరవేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ప్రిన్సిపాల్ ఆన్సీ జోసెఫ్, డైరెక్టర్స్ ఆదిరెడ్డి శరత్ తేజ్, విష్ణు తేజ్, హెచ్‌ఎం కనక మహాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ముగ్గుల పోటీల నిర్వహించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు సూరిబాబు, నాయుడు, మహిళా సాధికారత విభాగం కో ఆర్డినేటర్ సామ్రాజ్యం, సూపరింటెండెంట్ అనురాధ విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న విద్యాసంస్థలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంస్థ ప్రాంగణం పల్లెలో జరిగే సంక్రాంతి పండగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. స్కూల్ ప్రాంగణంలో వేసిన 'పల్లెటూరు గుడిసె ఇల్లు" సెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల హరిదాసుల వేషధారణ, సంద్రదాయ వస్త్రధారణ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, స్కూల్ డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎస్సిపిసిఆర్)ఆదేశాల మేరకు వన్ టౌన్ లోని గవర్నమెంట్ విక్టోరియా ఆసుపత్రిలో దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో తప్పులు సరిచేసి నూతన జనన ధ్రువీకరణ పత్రాలు జారీ కేంద్రం ప్రారంభిస్తుండడం హర్ష ణీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు.ఆసుపత్రి ప్రాంగణంలో శుక్రవారం పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల్లో తల్లిదండ్రుల పేర్లు సవరణలతో 48 గంటల్లో జారీ కేంద్రం ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గొండు సీతారాం,గవర్నమెంట్ విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష,మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉప్పాడ జీవన్ సంతోష్ కుమార్ ల చేతులు మీదుగా రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ,గత ఏడాది నవంబర్ 31 న ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమీక్ష సమావేశంలో ఎన్నో ఏళ్లుగా పిల్లల జన్మ దిన నమోదులో తప్పులు సరిచేయడంలో జరుగుతున్న తాత్సారం, ఇబ్బందులపై చర్చించామన్నారు.అప్పట్లోనే దరఖాస్తులు చేసుకున్న 48 గంటల్లోగా తప్పులను సరిచేస్తూ వీటిని త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని తాము ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష మాట్లాడుతూ, అనుకున్న సమయానికే ఈ ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు నిత్యం కృషి చేస్తామని చెప్పారు. ధ్రవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్మెంట్ ప్రోజెక్ట్ ఆఫీసర్లు రమణ కుమారి,జి.శ్రీలత, హెడ్ నర్స్ జి.చంద్రకళ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న సీతారాం

మార్చి 8న ప్రపంచ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖ నగరానికి చెందిన సాహసీకుడు భరద్వాజ్ దయాల మరోసారి ప్రపంచ యాత్రకు సిద్ధమయ్యారని, మార్చి 8న విశాఖ నగరం నుండి ప్రపంచ యాత్రకు భరద్వాజ్ బయలు దేరుతున్నానని పేర్కొన్నారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ పాత్రికేయుడు ఎన్..నాగేశ్వరరావు, సాహస యాత్రకు సిద్ధపడిన భరద్వాజ్ దయల మాట్లాడుతూ, 10 లక్షల అద్భుతమైన మహిళలు అనే నినాదంతో తన యాత్రను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచంలోని 7 ఖండాలు,195 దేశాలలో పర్యటిస్తారన్నారు.ఈ పర్యటనలో పది లక్షల అద్భుతమైన మహిళల ఫోటోలను చిత్రీకరిస్తారని, ఆ ఫోటోలు ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మహిళలు స్థితి గతులను తెలియజేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు.2004లో మోటర్ సైకిల్ మీద భారత దేశం యాత్ర చేసిన భరద్వాజ్ 2006లో ప్రపంచ యాత్ర చేశారని చెప్పారు. ప్రపంచ యాత్రలో ఐదు ఖండాలు 16 దేశాల మీదుగా 47 వేల కిలోమీటర్లు ప్రయాణం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పర్యావరణమేత్త సోహన్ అట్టంగడి, సాహస మహిళ వైశాలి, జెసిఎ మహిళా విభాగం అధ్యక్షురాలు కలిక పాల్గొన్నారు.ప్రపంచంలో ఉన్న మహిళలను ఒక తాటి మీదకు తీసుకువచ్చేందుకు తన ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

క్వారీ లారీలకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం బుచ్చంపేట మీదుగా వెళ్లే క్వారీ లారీలకు అడ్డుకట్ట వేయాలని ఆ గ్రామ యువత కోరారు. ఈ మేరకు శుక్రవారం చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్. రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం యువత మాట్లాడుతూ, నిత్యం అధిక లోడుతో క్వారీ లారీలు గ్రామం నుంచి తిరగడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని చెప్పారు. అదే విధంగా ఈ లారీలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన గురవుతున్నామని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వినతిపత్రం ఇస్తున్న యువకులు